సాక్షి
నిర్మల్
గురువారం । 13 । జూలై । 2023



సర్కారు బడులకు కొత్త కళ

సర్కారు బడుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 'మనఊరు -మనబడి' పథకానికి శ్రీకారం చుట్టింది. పలు పాఠశాలలను ఎంపిక చేసి నూతన భవనాలు, అధునాతన మరుగుదొడ్లు, డైనింగ్‌హాళ్లు నిర్మిస్తూ.. ఇతర వసతులు కల్పిస్తోంది. 9లో▸

ప్రొవిజనల్ జాబితా విడుదల

నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని వైద్యారోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన రెండు వైద్యాధికారుల పోస్టుల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో కూడిన పత్రాలతో ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి సత్యవతికి మొక్క ఇస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: నియోజకవర్గంలోని పలు సమస్యలపై బుధవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ హైదరాబాద్‌లో ఇద్దరు మంత్రులను కలిశారు. ఖానాపూర్‌లో డయాబెటిక్ సెంటర్ ఏర్పాటు చేయడంతోపాటు పట్టణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావును కలిసి విన్నవించారు. గిరిజన తండాల్లోని పలు సమస్యలతో పాటు పెంబి మండలం పుల్గంపాండ్రిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ.. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పుప్పాల శంకర్, గజేందర్, శ్యాం, రాజిరెడ్డి, సంజీవ్ తదితరులున్నారు.

'ఎడిట్ అవకాశం ఉంది'

నిర్మల్ రూరల్: జిల్లాలోని కేజీబీవీల్లో తాత్కాలిక పద్ధతిలో ఎస్వో, పీజీ సీఆర్టీ, సీఆర్టీ, పీఈటీలుగా పని చేసేందుకు ఆన్‌లైన్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు దరఖాస్తులో ఎడిట్ ఆప్షన్, పోస్ట్ అప్లైడ్ జిల్లా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులంతా ఈనెల 13నుంచి 15వ తేదీ వరకు https://schooledu.telangana.gov.inలో నమోదు లేదా సవరణ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష ఈనెల 24, 25, 26 తేదీల్లో ఉంటుందని తెలిపారు. సాంకేతిక ఇబ్బందులుంటే 73866 60584 నంబర్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 5లోపు సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



లాంగ్‌జంప్ పోటీలు నిర్వహిస్తున్న పీఈటీలు

నిర్మల్‌టౌన్: హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. నాలుగో తరగతిలో ప్రవేశానికి 18 మంది, ఐదో తరగతిలో ప్రవేశానికి 18మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి క్రాంతికుమార్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 40 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



నినాదాలు చేస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం చేపట్టిన ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెల గడుస్తున్నా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ప్రభుత్వం అందించలేదని ఆరోపించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లాలో మారుమూల గ్రామాలకూ ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నాయకులు అరవింద్, నవీన్, కైలాస్, అంబదాస్, రాజు, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌తోనే ఆర్థిక, సామాజిక భద్రత

లోకేశ్వరం: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌తోనే ఆర్థిక సామాజిక భద్రత ఉంటుందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈ నెల 24న నిర్మల్ పట్టణంలో కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యాత్ర ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రేవంత్, ప్రిన్సిపాల్ తుకారాం, అధ్యాపకులు వినోద్, వెంకట్, చిన్నయ్య, మహేందర్ తదితరులున్నారు.



ప్రాజెక్ట్‌లోకి వస్తున్న భారీ వరద (ఫైల్)

'కడెం' ప్రళయం..!

- ఏడాదైనా మరిచిపోని జనం
- భయంభయంగా ఆ రెండ్రోజులు
- వరద మిగిల్చిన నష్టాలెన్నో..
- భారీ వరదను ఆపిన ప్రాజెక్ట్
- గుర్తు చేసుకుంటున్న ప్రజలు



ఎడమ కాలువ తూము నుంచి వెళ్తున్న వరద (ఫైల్)



కడెంలోని ఓ కాలనీని ముంచెత్తిన వరద (ఫైల్)

కడెం: 2022 జూలై 12 అర్ధరాత్రి.. భారీ వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌కు సామర్థ్యానికి మించి ఉప్పెనలా వరద పోటెత్తింది. డ్యాం పూర్తిగా నిండి తెగేలా ఉందని ఏకధాటిగా సైరన్ మోగుతోంది. నిద్రలోంచి ఉలిక్కిపడి ఏం జరుగుతుందోనని జనం రోడ్ల పైకి వచ్చారు. 'డ్యాం కొట్టుకుపోతుందట..' అని భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, గొడ్డూగోదను వదిలి బతికుంటే చాలని ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో అర్ధరాత్రి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. కడెం ప్రాజెక్ట్ చరిత్రలోనే.. కనీవినీ ఎరగని రీతిలో వచ్చిన భారీ వరద కారణంగా ముంపు గ్రామాలు అతలాకుతలమై నేటికి ఏడాదవుతున్న సందర్భంగా కథనం..

రికార్డ్ స్థాయిలో వరద

అంచనాలను మించి కడెం ప్రాజెక్ట్ చరిత్రలోనే తొలిసారి సామర్థ్యానికి మించి ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీ)అడుగులు కాగా అంతకుమించి వరదచేరింది. ప్రాజెక్ట్ వరద గేట్ల నుంచి సుమారు 3 లక్షల క్యూసెక్కుల నీరు మాత్రమే బయటకు వెళ్లింది. భారీగా వచ్చిన వరద గేట్ల పైనుంచి పారింది. 18 వరద గేట్లలో ఒక గేటు మొరాయించగా 17 గేట్లు ఎత్తి చేతులెత్తేశారు అధికారులు. రెండ్రోజులు భారీగా ఇన్‌ఫ్లో రాగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అదేస్థాయిలో ఇన్‌ఫ్లో కొనసాగితే ప్రాజెక్ట్ తెగిపోయే పరిస్థితులుండగా క్రమంగా వర్షాలు, వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, గతేడాది జూలై 13న, 700 అడుగులు దాటి నిండుకుండలా ఉన్న ప్రాజెక్ట్.. ప్రస్తుతం 680.825 అడుగుల నీటి మట్టంతోనే ఉంది.

ఆశ్రయం ఇచ్చారు.. అలర్ట్ చేశారు

డ్యాం కొట్టుకుపోతుందని.. లోతట్టు ప్రాంతాల ప్రజలు కట్టుబట్టలతో వివిధ ప్రాంతాలు, బంధువుల ఊళ్లకు వెళ్లారు. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని వారిని పోలీసులు, యువత వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కన్నాపూర్ గ్రామస్తులు స్థానిక ఎల్ఎంఆర్ డిగ్రీ కళాశాలలో, కొండుకూర్ గ్రామస్తులు ఎత్తైన భవనాల్లో, కడెంలో ప్రభుత్వ ఆస్పత్రి, రైతువేదిక, పాఠశాలల్లో తలదాచుకున్నారు. వరదల కారణంగా ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనాలకు ఎంతోమంది తమ ఇళ్లల్లో ఆశ్రయం కల్పించారు. అప్పటి సీఐ ఆజయ్‌బాబు, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది రెండ్రోజులు ప్రాణనష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేశారు.

పరిహారం అందించాలి



గతేడాది కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చిన భారీ వరదల కారణంగా వంతెన పక్కన ఉన్న మా రెండెకరాల భూమి కొట్టుకుపోయింది. ఏడాది గడిచినా పరిహారం రాలేదు. భూమి చదును చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేసే స్థోమత లేక అలానే వదిలేశాం.

– హరీశ్, రైతు, పాండ్వపూర్

మరమ్మతులు చేపట్టాలి



గతేడాది కడెం ప్రాజెక్ట్ వరదల కారణంగా కడెం వాసులమంతా భయాందోళనకు గురయ్యాం. ప్రాణాలు కాపాడుకోవడానికి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాం. దెబ్బతిన్న ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– పాలకుర్తి కృష్ణ, కడెం

మరమ్మతులు చేస్తున్నాం



గతేడాది వచ్చిన భారీ వరదల కారణంగా ప్రాజెక్ట్ వరద గేట్లు, కాలువలు దెబ్బతిని, కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోయాయి. కాలువల మరమ్మతు చేశాం. రెండో నంబర్ వరద గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాం. మూడో నంబర్ గేటుకు త్వరలోనే బిగిస్తాం.

– భోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

గుట్టపై తలదాచుకున్నారు



గుట్టపై తలదాచుకున్న డ్యాంగూడ వాసులు

ఈచిత్రంలో కనిపిస్తున్నది కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని డ్యాంగూడ వాసులు. కడెం ప్రాజెక్ట్ దిగువనే ఉండే గూడెంవాసులను ఎవరూ పట్టించుకోలేదు. వీరు కడెంను దాటి రాలేని పరిస్థితి. ఆ అర్ధరాత్రి సమీపంలోని గుట్టపై ఎక్కి వర్షంలో బిక్కుబిక్కుమంటూ తలదాచుకున్నారు.

వరద మిగిల్చిన నష్టాలు

- కడెం ప్రాజెక్ట్ భారీ వరదల కారణంగా విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు వెయ్యి స్తంభాలు, 400 ట్రాన్స్‌ఫార్మర్లు నేలమట్టమయ్యాయి. రూ.3 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది మరమ్మతు చేపట్టి రెండ్రోజుల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.
- ప్రాజెక్ట్ 2, 3 నంబర్ వరద గేట్ల కౌంటర్ వెయిట్‌లు, కాలువలు, వరద గేట్లు దెబ్బతినడంతో భారీగా నష్టం వాటిల్లింది.
- కడెం ఆయకట్టు కింద పాండ్వపూర్ తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వందల ఎకరాలు కొట్టుకుపోయి సాగుకు పనికి రాకుండా మారాయి.
- వరదతో పాండ్వపూర్ సమీపంలోని వంతెన దెబ్బతినగా, ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయి సుమారు రూ.3కోట్ల మేర నష్టం వాటిల్లింది.
- కడెంలో దుకాణాసముదాయాలు, పలువురు ఇళ్లలోకి వరదనీరు వెళ్లి నష్టం వాటిల్లింది.

కలిసి పనిచేస్తాం.. మళ్లీ గెలుస్తాం

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- కమలం వీడి కారెక్కిన అప్పాల వర్గం
- ఘనస్వాగతం పలికిన గులాబీశ్రేణులు



కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ

నిర్మల్/నిర్మల్‌టౌన్: 'కలిసి పనిచేస్తాం.. మళ్లీ మేమే గెలుస్తాం..' అని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ధీమా వ్యక్తంజేశారు. తన రాజకీయ గురువుగా పేర్కొనే అల్లోల, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరుల సమక్షంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ కండువా వేసి ఆయనను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. జిల్లాకేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన చేరికల కార్యక్రమంలో భారీ అనుచరగణంతో గణేశ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకుముందు స్థానిక మార్కెట్‌కమిటీ (ఎడ్లఅంగడి) నుంచి భారీ బైక్ ర్యాలీతో దివ్యగార్డెన్స్ చేరుకున్నారు.

ఐటీ పరిశ్రమ తెస్తాం

మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌లాంటి వారు సొంత పార్టీకి తిరిగి రావడం సంతోషంగా ఉందని మంత్రి ఐకేరెడ్డి పేర్కొన్నారు. నిర్మల్‌లోనూ ఐటీ ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరడంతో పాటు ఎమ్మెల్సీ దండె విఠల్‌కూ సూచించామని మంత్రి తెలిపారు.

ప్రాణమున్నంత వరకూ అల్లోలతోనే..

మంత్రి ఐకేరెడ్డితో ఇరవై ఏళ్లకు పైగా కలిసి పనిచేశానని, విద్యార్థి దశ నుంచే అల్లోల అడుగుజాడల్లో నడిచానని అప్పాల గణేశ్‌చక్రవర్తి పేర్కొన్నారు. అనివార్య కారణాలతో 2018నుంచి తాత్కాలికంగా నాలుగేళ్లు విడిపోయానన్నారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో మంత్రిని మళ్లీ కలిశానని చెప్పారు. ఇక తన ప్రాణం ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ జెండా, అల్లోల చేయి విడిచిపెట్టనని కేటీఆర్ ముందు మాట ఇచ్చానన్నారు. పార్టీ శ్రేణుల సహకారంతో రానున్న ఎన్నికల్లో పట్టణం నుంచి 10వేల మెజార్టీ ఇస్తామని చెప్పారు.

భారీగా చేరికలు..

బీఆర్‌ఎస్‌లో అప్పాల గణేశ్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ నుంచి భారీ సంఖ్యలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, సైండ్ల ఉమారాణి-శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల రవి, తోట నర్సయ్య, గోపు గోపి, నేళ్ల అరుణ్‌కుమార్, షాకీర్, అలీం, అప్పాల ప్రభాకర్ తదితరులతోపాటు కులసంఘాల నేతలున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఆర్బీఎస్ జిల్లా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, కౌన్సిలర్లు తదితరులున్నారు.

వీఆర్‌ఏలకు ఊరట



డిమాండ్లు నెరవేర్చాలని మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

జిల్లా	పని చేస్తున్న వీఆర్‌ఏలు
ఆదిలాబాద్	392
మంచిర్యాల	542
నిర్మల్	740
కుమురంభీం	317
మొత్తం	1,991

- నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు
- వివిధ శాఖల్లో సర్దుబాటుకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 1,991 మందికి లబ్ధి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎట్టకేలకు గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ)కు పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్న 1,991మంది వీఆర్‌ఏలకు భారీ ఊరట కలిగింది. తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ గత జూలై 25 నుంచి అక్టోబర్ 13వరకు మొత్తంగా 83రోజులపాటు సమ్మెలో పాల్గొన్నారు. అప్పట్లో ప్రభుత్వం స్పందించకపోవడంతో తిరిగి విధుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని ప్రకటించారు. తాజాగా వారం రోజుల్లో వీఆర్‌ఏల విద్యార్హతను బట్టి 11 ప్రభుత్వ శాఖలకు కేటాయించేందుకు కసరత్తు సాగుతోంది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులతో రెండు రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న వారందరికీ ప్రస్తుతం పొందుతున్న గౌరవ వేతనం రూ.11,500 నుంచి నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తే రెట్టింపు జీతం పొందే అవకాశం ఉంది. ఏళ్లుగా గ్రామాల్లో వారసత్వంగా సుంకరి, ఇతర స్థాయిలో పని చేస్తూ గ్రామ సేవకులుగా కొనసాగుతున్న వారికి ఎలాంటి విద్యార్హతలు లేవని, వీరిని కూడా నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఆ తరువాత కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎన్నికైన వారు కూడా ఉన్నారు. ఇందులో కనీస అర్హత పది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చేసిన ఉన్నత విద్యావంతులు కూడా ఉన్నారు. వీరికి కూడా విద్యార్హతలను బట్టి వివిధ హోదాలు కేటాయిస్తే ఉన్నత అర్హతలున్న వారికి కూడా వేర్వేరు స్థాయిల్లో గుర్తించాలనే డిమాండ్ ఉంది. ఎలాంటి అర్హత లేని వారు, ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న వారు, వారి వారసులను కారుణ్యం కింద ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్లున్నాయి. ప్రభుత్వం విద్యార్హతలనే ప్రామాణికంగా తీసుకునే యోచన ఉండడంతో ఎలాంటి విద్యార్హతలు లేని వారిని ఎలా సర్దుబాటు చేస్తారనే దానిపైన మంత్రివర్గ ఉప సంఘం వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరుపుతోంది.

త్వరగా పూర్తి చేయాలి...



ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి కచ్చితమైన జాబ్‌చార్టర్ లేక కేవలం గౌరవ వేతనంతోనే పని చేస్తున్న వీఆర్‌ఏలను వివిధ ప్రభుత్వ శాఖల్లోకి వెంటనే సర్దుబాటు చేయాలి. ఉద్యోగుల అర్హతను బట్టి విధులు కేటాయించాలి. సమ్మెలో పేర్కొన్న డిమాండ్లను నెరవేర్చాలి.

– దుర్గం శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా, వీఆర్‌ఏ జేఏసీ కన్వీనర్

ఉమ్మడి జిల్లాలో..

రెవెన్యూ శాఖ ప్రక్షాళనలో భాగంగా విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో వీఆర్వోలకు కింది స్థాయిలో పని చేసే వీఆర్‌ఏలకు పదోన్నతి, జాబ్ చార్టర్ లేక ఉన్నతాధికారులు చెప్పినట్లుగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. భూ సంబంధిత వ్యవహారాలు మినహా అన్ని పనుల్లో గ్రామాల్లో ఉండే రోజువారీ కార్యక్రమాలు ఉన్నతాధికారుల పర్యటనలో ప్రొటోకాల్ విధులు, పౌర సరఫరాల శాఖ సంబంధించిన విధులు, ధాన్యం కొనుగోలు, అమ్మకాలు తదితర విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దు తరువాత కచ్చితమైన జాబ్‌చార్టర్ లేక స్థానిక తహసీల్దార్ల ఆదేశాలతోనే గ్రామాల్లో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వీఆర్‌ఏలు అందరికీ భారీ ఊరట కలిగిస్తోంది.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: రైతులకు ఉచిత కరెంట్ ఎందుకని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ధరణి, ఉచిత కరెంట్ వద్దంటున్న వారిని ప్రజలు గమనించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆర్బీఎస్ జిల్లా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మొబైల్ పోతే ఆందోళన వద్దు

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్
- బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, బాధితులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. https://www.ceir.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమని పేర్కొన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 22 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి బుధవారం బాధితులకు ఎస్పీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ పోతే మొదట అదే నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని, వెబ్‌సైట్‌లో లాగిన్ చేసి, ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్లోడ్ చేసి, రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ అని నమోదు చేసుకోవాలని సూచించారు. తర్వాత తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనేముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఫోన్లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతికను ఉపయోగిస్తుందని తెలిపారు. టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అనే అప్లికేషన్ పోయిన ఫోన్‌ను వెతికి పెట్టడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్ గురించి పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందజేయడంలో కృషిచేసిన ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు. డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

'పే రివిజన్ కమిషన్‌ను నియమించాలి'



మాట్లాడుతున్న జుట్టు గజేందర్

నిర్మల్ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 12వ పేరివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను నియమించిన నేపథ్యంలో మన రాష్ట్రంలోనూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని పీఆర్సీని నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జుట్టు గజేందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలు, పదోన్నతులపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేతకు ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు దిశగా ఆలోచన చేయాలని కోరారు. నాయకులు నాంపల్లి నాగభూషణ్, లక్ష్మణ్, గోవింద్‌నాయక్, శ్రీనివాస్, పోతన్న, గంగాధర్ బోస్లే, ఇంతియాజ్ అహ్మద్, పల్సికర్ శ్రీనివాస్, రాజమహేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుకున్న గుడుంబాతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, రాంరెడ్డి పల్లె, ఎక్బాల్‌పూర్ తండాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తర్లపాడ్‌లో రాధ, రాంరెడ్డి పల్లెలో షీలాబాయి, ఎక్బాల్‌పూర్‌లో తారాచంద్ నివాసాల్లో 5 లీటర్ల చొప్పున మొత్తం 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయాబారపు రవికుమార్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిందితులను బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఇంటలిజెన్స్ ఎస్సై గజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రాచాపూర్‌కు చెందిన జడ రాజేశ్వర్ (53) బుధవారం ఉదయం కాలినడకన రాచాపూర్ నుంచి పొట్టపెల్లి వైపు వెళ్తుండగా మార్గమధ్యలో లక్ష్మణచాంద నుండి నిర్మల్ వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం ఢీకొట్టి దాదాపు 30 మీటర్ల దూరం వరకు రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య రుక్మవ్వ ఫిర్యాదు మేరకు వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

ఈతవనాన్ని పరిశీలించిన రాష్ట్ర బృందం

తాంసి: మండల కేంద్రంలోని ఈత వనాన్ని బుధవారం ఉపాధిహామీ పనుల పరిశీలన రాష్ట్ర బృందం సభ్యులు పరిశీలించారు. 2017లో నాటిన మొక్కలను నల్గొండ డిప్యూటీ సీఈవో మొగులప్ప, ఏపీడీ సిద్దిఖీ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. వనంలో గతంలో నాటిన మొక్కలతో పాటు ఇప్పటి వరకు పెరిగిన మొక్కలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సర్పంచ్ కృష్ణ, ఏపీవో విజయ, ఈత వనం పెంపకందారుడు శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

రేషన్ వ్యాన్ బోల్తా



బోల్తా పడ్డ వ్యాను

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, కోసగుట్ట గ్రామాలకు రేషన్ బియ్యం తరలించేందుకు వెళ్తున్న వ్యాను పెంబి శివారులోని పెంబితాండ వద్ద బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌తో పాటు లేబర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జోరుగా పశువుల అక్రమ రవాణా



అక్రమంగా తరలిస్తున్న పశువులు

- గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలింపు
- కాసులు కురిపిస్తున్న దందా
- పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ(బోథ్): జిల్లాలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో జిల్లా సరిహద్దులు దాటించి హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఈ దందా సాగిస్తూ కోట్లు దండు కుంటున్నారు. ఆవులు అక్రమ రవాణాపై కఠినమైన నిబంధనలతో పాటు నిషేధం ఉన్నా దందా ఆగడం లేదు.

గుట్టుచప్పుడు కాకుండా దందా...

అక్రమార్కులు కొత్త పద్ధతుల ద్వారా పశువులను దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు, రవాణా శాఖకు పట్టుబడకుండా ఉండేందుకు భారీ కంటైనర్లలో తరలిస్తున్నారు. పరిమితికి మించి పశువులను ఎక్కించి వందల కిలోమీటర్ల దూరం రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని పశువులు ఊపిరాడక మార్గమధ్యలోనే చనిపోతున్నాయి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. పశువుల రవాణపై నిషేధం ఉంది. పశువుల అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.
– పుప్పల శ్రీనివాస్, డీటీసీ, ఆదిలాబాద్

ఆదిలాబాద్ కేంద్రంగా...

జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలో చంద్రాపూర్, యావత్మల్, కిన్వట్ రాజుర, మాండ్వీ, ప్రాండకొడ, నాగ్‌పూర్ లాంటి పట్టణ ప్రాంతాల్లో ఎంపిక చేసుకున్న దళారుల ద్వారా తక్కువ ధరలకు పశువులను కొనుగోలు చేసి వాటిని సరిహద్దులో ఉన్న గ్రామాల్లో లారీలో ఎక్కించి జిల్లా మీదుగా జహీరాబాద్‌లో ఉన్న కబేళ కేంద్రానికి తరలిస్తున్నారు. పశువులు తరలించడానికి ఉపయోగించే వాహనాలకు రూ.లక్ష వరకు అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం.

మామూలుగా చూస్తున్న అధికారులు...

జిల్లా మీదుగా నిత్యం గుట్టుచప్పుడు కాకుండా కంటైనర్లు, ఇతర ప్రత్యేక వాహనాల ద్వారా పశువులు తరలిపోతున్నా రవాణాశాఖ అధికారులు మాత్రం మాములుగా తీసుకుంటున్నారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని బోరజ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతించాల్సి ఉండగా పశువులు తరలిస్తున్న వాహనాలు చెక్‌పోస్టు దాటుతుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల పట్టుబడిన వాహనాలు..

- మార్చి 17న నేరడిగొండ మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద పశువులు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకుని 16 ఆవులను స్వాధీనం చేసుకున్నారు.
- మే 4న నేరడిగొండ మండలంలోని జాతీయ రహదారిపై టోల్ ప్లాజ వద్ద పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకుని 16 ఆవులను స్వాధీనం చేసుకున్నారు.
- మే 26న గుడిహత్నూర్ మండల కేంద్రలోని జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలో గఢ్ చందుర్ నుంచి హైదరాబాద్ తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని 38 పశువులను స్వాధీనం చేసుకున్నారు.
- జూన్ 21న నేరడిగొండల మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజ వద్ద వాహనాన్ని తనిఖీ చేసి 23 పశువులను స్వాధీనం చేసుకున్నారు.
- జూన్ 22న ఇచ్చోడ మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి ఐదు పశువులను స్వాధీనం చేసుకున్నారు.
- జూలై 9న నేరడిగొండ మండలంలోని టోల్‌ప్లాజా వద్ద లారీని తనిఖీ చేసి 28 పశువులను స్వాధీనం చేసుకున్నారు.

సాయినగర్ షిర్డీ రైలులో చోరీ

- తొమ్మిది మంది యువతులను పట్టిచ్చిన ప్రయాణికులు
- కొంతమంది బ్యాగులు, మహిళ బంగారు చైన్ మాయం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ మీదుగా తిరుపతి నుంచి షిర్డీ వెళ్తున్న సాయినగర్ షిర్డీ రైలులో దొంగతనానికి పాల్పడిన తొమ్మిది మంది యువతులను ప్రయాణికులు పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. రైలు నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన తర్వాత నవీపేట్ స్టేషన్ వద్ద క్రాసింగ్ ఉండటంతో అక్కడ ఆగిపోయింది. దీంతో మహారాష్ట్రలోని బిడ్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది యువతులు రైలులో ఎక్కారు. యువతులు ఎస్1 నుంచి ఎస్10 బోగీలలో అటు ఇటూ తిరిగినట్లు ప్రయాణికులు తెలిపారు. మొదట ఓ బోగీలో ప్రయాణికుడి బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. అప్రమత్తమైన ఆ కోచ్‌లోని మిగతా వారు తమ బ్యాగ్‌లను చెక్ చేసుకోగా మరో ఆరుగురికి చెందిన బ్యాగులు కూడా కనిపించలేదు. దీంతో బోగీలో కలకలం రేగింది. కొందరు ప్రయాణికులు బాసర వద్ద ట్రైన్ చైన్ లాగడంతో ఆగిపోయింది. ఈ క్రమంలో కొందరు యువతులు బ్యాగులతో పరుగెత్తడంతో ప్రయాణికులు పట్టుకున్నారు. బాసర పోలీసులకు సమాచారం అందించి, మొత్తం తొమ్మిది మందిని అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎఫ్, బాసర పోలీసులు అక్కడి నుంచి యువతులను నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బ్యాగులు, బంగారం మాయం..

రంగస్వామి అనే ప్రయాణికుడికి చెందిన బ్యాగ్‌తో పాటు ల్యాప్‌టాప్, కొంత నగదు, ఓ మహిళ మెడలోని బంగారు చైన్ పోయినట్లు తెలిసింది. పావని, ధనుంజయ్, షేక్ నజీర్ బాషా, లీలావతి, సుబ్బారాయుడు, శ్రీనివాస్ అనే ప్రయాణికుల బ్యాగ్‌లు పోయాయి. మూడు బ్యాగ్‌లను పోలీసులు రైల్వే పట్టాల పక్కన గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని బ్యాగులను యువతులు బాత్‌రూమ్‌లలో పెట్టినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న తొమ్మిది మంది యువతులను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. యువతులు నాందేడ్‌లోని గురుద్వార్‌కు వెళ్లి అక్కడ నుంచి నిజామాబాద్ వచ్చినట్లు తెలిసింది.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థి నిఖిల్‌గౌడ్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఈ నెల 8 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న ఐదవ జాతీయ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో క్వార్టర్స్‌లో హర్యానా బాక్సర్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కి వెళ్లినట్లు కోచ్ ఆనంద్ భాస్కర్ తెలిపారు. క్రీడాకారున్ని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలురి గోవర్ధన్ రెడ్డి అభినందించారు.

చెరువు తూము గేటు చోరీ



గేటు లేని తూము

కుంటాల: మండలంలోని అంబకంటి శీలకుంట చెరువు తూము గేటు ఇటీవల చోరీకి గురైంది. ఈ చెరువు ఆయకట్టు సుమారు 45 ఎకరాలుగా ఉంది. భారీ వర్షాలు కురిస్తే చెరువు నిండినా తూము గేటు లేకపోవడంతో నీరంతా వృథాగా పోయే అవకాశముందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తూముకు గేటు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కోతుల దాడిలో బాలుడికి గాయాలు



కోతుల దాడిలో గాయపడ్డ బాలుడు

కడెం: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన దుర్గం మనోహర్ అనే బాలుడిపై కోతులు దాడి చేశాయి. దుర్గం ప్రవళిక -శ్రీనివాస్ దంపతుల కుమారుడు మనోహర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో కోతులు దాడి చేయడంతో కాలు, వీపు భాగంలో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

తల్లీకొడుకుల ఆచూకీ లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: తప్పిపోయిన తల్లి, కుమారుడి ఆచూకీని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసులు కనిపెట్టారు. బుధవారం వారిని ఇచ్చోడ పోలీసులకు అప్పగించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై బాకీ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 ఏప్రిల్‌లో ఇచ్చోడకు చెందిన జాదవ్ సునీత, ఆమె కుమారుడు శివప్రసాద్ తప్పిపోయారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. యూనిట్ బృందం వారిని తీసుకొచ్చి ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో అప్పగించగా, ఇచ్చోడ పోలీసులు వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఖమరొద్దీన్ అనే యువకుడు అదృశ్యమైనట్లు టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 10న ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి కూలి పనికోసం బయల్దేరి వె ళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్క ప్రాంతాల్లో కుటుంబీకులు గాలించారు. ఆచూకీ ల భించకపోవడంతో యువకుడి సోదరుడు షేక్ ర హీమ్ బుధవారం టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని కంకెట గ్రామానికి చెందిన సిరిగిరి ఇస్తారి(75) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్తారి భార్య మృతి చెంది 30యేళ్లు గడిచింది. కొడుకు ఉన్నా తన భార్య మరణానంతరం ఒంటరిగా ఉండడానికి అలవాటు పడ్డాడు. తన పనులు తాను చేసుకుంటూ జీవించేవాడు. వయస్సు పైబడడంతోపాటు తన పనులు తాను చేసుకోలేక, ఎవరిపైనా ఆధార పడడం ఇష్టం లేక ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు సిరిగిరి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

బడిలో గోబర్‌గ్యాస్ ప్లాంటు

- ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు
- పర్యావరణ సమతుల్యతే లక్ష్యంగా..
- తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తికి చర్యలు



దేవునిగూడ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గోబర్‌గ్యాస్ ప్లాంట్

పాతమంచిర్యాల: సురక్షితమైన పద్ధతులతో, పర్యావరణానికి హాని తలపెట్టకుండా మనకు లభించే వనరులతో తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గోబర్‌గ్యాస్(బయోగ్యాస్) ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ముందుగా పశువుల పేడ అందుబాటులో ఉండే పాఠశాలలు, నిర్మాణానికి అనువైన స్థలం అందుబాటులో ఉన్న పాఠశాలల్లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్యాస్ సిలిండర్లు, వంట చెరుకు కొనుగోలు ఖర్చులు ఆదా అవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని జన్నారం మండలం దేవునిగూడెం, చెన్నూరు మండలంలోని కిష్టంపేటలో గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.70 నుంచి రూ.80 వేల వరకు ఖర్చు చేయనున్నారు.

గ్యాస్ ఉత్పత్తి ఇలా..

ముందుగా ప్లాంట్‌లో పశువుల పేడను వేస్తే అది కుళ్లిపోయిన తర్వాత గ్యాస్ ఉత్పత్తి కావడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. ఆ తర్వాత ప్రతీరోజు ప్లాంట్‌లో రెండు నుంచి మూడు తట్టల పేడ వేస్తే గ్యాస్ ఉత్పత్తి జరుగుతుంది. రోజుకు 40 నుంచి 50 మందికి వంట చేయడానికి సరిపడా గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ప్లాంట్‌లో పేడను వేసే బాధ్యతను గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించనున్నారు. గతంలో గృహావసరాల కోసం గ్రామాల్లో గ్లోబర్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇంటి యజమానులకు నగదు చెల్లించింది. కొద్దిరోజుల పాటు బయోగ్యాస్ వినియోగం జరిగినా కాలక్రమేణా తగ్గిపోయింది. గ్యాస్ సిలిండర్ల రాకతో గోబర్‌గ్యాస్‌పై ప్రజలకు ఆసక్తి తగ్గిపోయింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గోబర్ గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసి బయోగ్యాస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనకు వస్తున్న కేంద్ర బృందం సభ్యులు ఈ నెల 15 నుంచి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, అమలు పరిశీలన చేయనున్నారు. ఇందులో భాగంగా గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణాలను కూడా పరిశీలిస్తారు.

తక్కువ ఖర్చుతో..



సురక్షితమైన పద్ధతులతో వంట చేసుకోవడమే కాకుండా పర్యావరణానికి హాని తలపెట్టకుండా మనకు లభించే వనరులతో తక్కువ ఖర్చుతో వంటగ్యాస్ ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశువుల పేడ అందుబాటులో ఉండే పాఠశాలలు, అనువైన స్థలం ఉన్న పాఠశాలల్లో ప్లాంట్ నిర్మించనున్నాం. జిల్లాలో రెండు చోట్ల గోబర్‌గ్యాస్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోంది.
– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

పండ్ల తోటల సాగుపై దృష్టిపెట్టాలి



రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం మండలంలోని జీయర్‌నగర్, కొత్తగూడ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మామిడి తోటలను పీహెచ్‌వో సందీప్‌తో కలిసి పరిశీలించారు. పంట సాగు వివరాలు, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అంతరపంటగా పెసర, కంది, మునగ, మినుము వంటి పంటల సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని సూచించారు. రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న వానపాముల ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో సుధీర్ కుమార్, సీపీఎఫ్ సంస్థ ప్రతినిధులు సత్య, రవి, మంగ, న్యాను, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు శిక్షణ కేంద్రాలుగా ఉద్యాన నర్సరీలు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని నాలుగు ఉద్యాన నర్సరీలను (ఉట్నూర్, జంబుగ, భీమారం, బెల్లంపల్లి) రైతు శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఉట్నూర్‌లోని హెచ్‌ఎన్‌టీసీ ఉద్యాన నర్సరీని బుధవారం ఆమె సందర్శించారు. నర్సరీలో ఈ ఏడాది పెంచుతున్న మొక్కలను ప్రాజెక్టు అధికారి సందీప్‌కుమార్ వివరించారు. పసుపు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల సాగు ప్రయోగాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. పీవో వెంట హెచ్‌వో సుదీర్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్ కుమార్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్ ఆశ్రమ పాఠశాలలో ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందువల్ల వసతి గృహాల్లో పరిసరాలతో పాటు వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఆగస్టు నుంచే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలలతో పాటు టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల్లో సీఆర్టీలను నియమించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను త్వరలో చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వసతి గృహాలకు జీసీసీ ద్వారా నిత్యావసర సరుకులతో పాటు, సిలిండర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమావేశంలో ఏసీఎంవో జగన్, జిల్లా గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

- మళ్లీ గెలిపిస్తే వైఎస్ పాలనను తీసుకువస్తాం
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



మామిడిగూడలో ఆదివాసీ మహిళలతో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

బోథ్: కాంగ్రెస్ హయాంలోనే గిరిజన, ఆదివాసీల అభివృద్ధి జరిగిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. బోథ్ మండలంలోని సొనాల, గుర్రాలతండా, మామిడిగూడ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. సొనాలలో ర్యాలీ చేపట్టారు. గుర్రాలతండా గ్రామంలో మల్హారిసింగ్ కుటుంబాన్ని పరామర్శించారు. మామిడిగూడలో ఆదివాసీలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు సౌకర్యం లేదని, కనీసం అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్ హయాంలో తమకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించారని, రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేశారని ఆ మహానేతను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు వైఎస్ రాజ్యం కావాలన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వైఎస్ పాలనను తీసుకువస్తామని శివసేనరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సొనాలలో తుల సుభాష్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. వైఎస్సార్‌కు సుభాష్ అత్యంత సన్నిహితుడిగా ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల అరుణ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నాయకులు గజేంధర్, నరేష్ జాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్



రాములును అభినందిస్తున్న వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో తెలుగు శాఖ అధ్యాపకుడు కొత్తపల్లి రాములుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ రాములును అభినందించారు. తెలుగులో అష్టాదశ పురాణాలు–దశావతార కథా విశ్లేషణ అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఆచార్యుడు కమలాకర శర్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశాడు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 20 పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను హైదరాబాద్‌కు తరలిస్తున్న అధికారులు

నిర్మల్‌ఖిల్లా: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో సమీకృత కలెక్టరేట్ సమీపంలోగల ఈవీఎం గోదామును బుధవారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఎఫ్ఎల్‌సీ మొదటి విడత తనిఖీ నిర్వహించారు. ఎన్నికల సామగ్రిని ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ అనిరుద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిరికొండ రమేశ్, గంగ్రత్ రమేశ్, సయ్యద్ మజార్, కే శ్రావణ్‌రెడ్డి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో హైదరాబాద్‌కు తరలించారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

బెల్లంపల్లి: పట్టణ శివారులోని బుధాకలాన్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సాయిబాబా ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడిలోని బాబా విగ్రహం పక్కన ఉన్న బీరువా తాళం పగులగొట్టి రూ.60 వేల విలువైన పంచలోహ విగ్రహం, వెండి కిరీటం, రూ.2వేల నగదు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన నిర్వాహకులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా అనుమానితులపై అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

టేకులబస్తీలో..

టేకులబస్తీలో ఉన్న మసీదుదర్గాలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. దర్గాలోని రెండు పెట్టేల్లో భద్రపర్చిన రూ.55వేల నగదు, ఐదు తులాల వెండి కడ్డీని పట్టుకెళ్లారని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు. నిర్వాహకుడు కొండి కొప్పుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి బదిలీ



నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల ప్రక్రియ మొదలైంది. పోలీస్‌శాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా నిర్మల్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆయనను కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో హుజూరాబాద్ ఏసీపీగా బదిలీ చేస్తూ బుధవారం డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జీవన్‌రెడ్డి దీర్ఘకాలంగా జిల్లాలో పనిచేస్తున్నారు. నిర్మల్ డీఎస్పీగా హైదరాబాద్ ట్రాఫిక్–2 ఏసీపీగా ఉన్న గంగారెడ్డి బదిలీపై రానున్నారు.